# నర్సు

రచన :
క్రొవ్విడి సూరి

"డాక్టర్" అందిఆత్రతతో నర్సు తక్షణమే. రెండంగల్లో కన్సల్టింగ్ రూమ్‌లోనుంచి పేషంట్సు వార్డులోనికి వచ్చాడు డాక్టర్. పెదిమి విరచి నిరాశ దృక్కులతో నిలబడియున్న నర్సుని చూచి అపాయమేదో సంఘటించిందని డాక్టర్ గ్రహించ గలిగాడు.

"యీ 7 వ బెడ్డులో మనిషికి చాలా సీరియస్‌గావుంది డాక్టర్! అంచేత Final Injection యిచ్చి ప్రయత్నంచేసి చూద్దాం. మీరుకూడ యిక్కడేవుండి నాకు సహాయం చెయ్యాలి. లేకపోతే నాకు చాలా భయమేస్తుంది డాక్టర్. "సరేకానియ్యి" అని కన్సల్టింగ్ బిజినెస్‌కు యింకొక నర్సును పంపించాడు.

●

మధ్యాహ్నం 12 గం. అంతే యింజక్షన్ యిచ్చిన రెండు గంటలకు కన్నులుతెరిచి తలను రెండవ ప్రక్కకు తిప్పాడు రోగి. బ్రహ్మానంద భరితురాలైంది ఆ నర్సు. ఆమె యిప్పుడేకాదు యెప్పుడూ యేరోగికైనా కులాసాగా యుంటే అపరిమితానందం పొందుతుంది. తన జీవితాన్నే తుదివరకు యీ సేవతోనే గడపాలని ఆమె నిశ్చయించుకొంది. ఒంటరి కత్తెకావడం వల్ల తనకు వచ్చే జీతంతోటే నిర్విచారంగా ఆమె జీతం గడిచి పోతుంది. ఆమెరోగుల కష్టాల్ని తన కష్టాలక్రింద యెంచుకొనేది. వాళ్లు బాధపడితే తనూ బాధపడేది. ఏ పేషంటైనా సంపూర్ణ ఆరోగ్యవంతుడై పోతూ పోతూ ఆమె వద్దకు వచ్చి కృతజ్ఞాభి వందనాలు సమర్పిస్తే ముద్దులొలికే చిరునవ్వుతో వాటి నన్నిటిని అందుకొని, ఆరోగ్యము జాగ్రత్తగా కాపాడుకోమని, మాతృమూర్తివలె హెచ్చరిస్తూ యుండేది. ఆమె ప్రతిరోగి జీవితచరిత్ర అడిగి తెలిసికొని తన డైరిలో వ్రాసుకొనేది. పైన చెప్పిన రోగికదలగానే డాక్టర్‌తో 'యీతని జీవిత చరిత్ర నా డైరిలో వ్రాసుకోవచ్చుకదూ? డాక్టర్" అని అడిగింది ఒక చిన్నపిల్లలా. ఆమె అమాయికత్వానికతనికి నవ్వొచ్చింది. అది నవ్వటానికి సమయం కాదని నోరు మెదపక రోగికేసి పరిశీలనగా చూచాడు.

"ఆఁ......దా...హం..." అనిరెండు చేతులూ పైకెత్తి రెండోప్రక్కకు తిరిగాడు. ఆమె ప్రక్కనున్న ఫ్లాస్కులోని వేడికాఫీ గ్లాసులోపోసి అతనినోటి కందించింది. అతడు ఓ చిన్నపాపలా నాలుగు గుటకలు వేసాడు. యింతలో అతనికి యెక్కడున్నానా అనే ఆలోచన కలిగింది. ఇంకా రోడ్డు మీదే పడియున్నాడను కొన్నాడు. వెంటనే తన మీదనుంచి ఓ జట్కా దాటి వెళ్లినట్టె అనిపించిందా తనికి. 'ఆ...ఆ...ఆఁ...' అని అరిచాడు పాపం! 'ఏమిటీ' అందినర్సు. కాని అతడీ ధోరణిలోలేడు.

జట్కా వెళ్లిన తర్వాత దూరంలో ఒకకారు తనవైపువస్తున్నట్లు కనిపించింది. అతనికి. రోడ్డుమీదనుంచి ప్రక్కకు. దొర్లిపోవాలని గట్టి ప్రయత్నం చెయ్యటం మొదలు పెట్టాడు. గిజగిజ తన్నుకున్నాడు. లాభం లేకపోయింది పాపం!! చివరికి ఉస్ అని యింకో ప్రక్కకు తిరిగాడు నిస్సహాయస్థితిలో......

యింతలో కారు చక్రాలు బాగా దగ్గరకొచ్చేసాయి. వాటి బరువు తలుచుకొని బేజారైపోయాడు కారుని తని మీదనుంచి పోనివ్వద్దని, వేడుకొన్నాడు డ్రైవరు తన్ను చూడలేదని విచారించాడు. కళ్లుగట్టిగా మూసుకొని బిగబట్టాడు. కారు మీదనుంచి పోయింది. 'అబ్బా!...' అని యెగిరిపడ్డాడు—స్ప్రింగ్ కాట్‌లో, నర్సు తనరెండు చేతుల్తోటి అదిమిపట్టింది. డాక్టర్ కాఫీ అందించాడు......మళ్లీ రెండు గుటకలు...

కళ్లుతెరచి స్పష్టంగా చూచాడు. తను రోడ్డు మీద లేనని తెలుసుకొన్నాడు. తన యెదుటనున్న స్త్రీమూర్తినిచూచి ఆమె తన ప్రాణం రక్షించిందను

కొని కృతజ్ఞతా భావంతో రెండు చేతులూ యెత్తి నమస్కరించాడు. ఇంతలో డాక్టర్ "జాగ్రత్తగా కనిపెట్టుతూ ఉండమని" హెచ్చరించి వెళ్లిపోయాడు.

●

పైసంఘటనలను జరిగిన మరునాడు రోగికి చాలా భాగం తగ్గినా కొంచెం నీరసంగానే యున్నాడు. కాని అప్పుడప్పుడు మాట్లాడుతూ మాట్లాడుతూ విచారంగా కళ్ళలో నీళ్ళు నింపేవాడు. ఆ టైములో తనకి చనిపోవాలని ఉండనేవాడు. తన జీవితంలో పెరిగి ఆరినజ్యోతి తిరిగి వెలగదన్నాడు.

..........చెప్తూ చెప్తూ కళ్ళకు రెండు చేతులు అడ్డుపెట్టుకొని వెక్కి వెక్కి యేడ్చేవాడు. కొంత సేపటికి ఓ దీర్ఘ నిశ్వాసం విడచేవాడు. అతని వింత చేష్టలు చూస్తే ఆమెకు చాలా జాలికలిగేది. నువ్వెందుకు విచారిస్తావు, అని అనేకసార్లు అడిగింది. కాని అతని కన్నీళ్ళు. దీర్ఘనిశ్వాసలు తప్పలేదే. జవాబులు వచ్చేయికావు, తరచి తరచి అడిగిన తర్వాత యీ విధంగా అతడు చెప్పటం మొదలు పెట్టాడు.

"ఏముంది తల్లీ! యీ నిర్భాగ్యుని జీవితానికి ఒక అనుకోని ఘట్టం సంభవించింది. దానితోనే జీవిత సమాప్తికి పరితపించాలని భగవద్విలాసము భిన్నమైపోయింది. నేను ఆ రోజుల్లో అంటే యిప్పటికి రెండేండ్లక్రితం ఘోటక బ్రహ్మచారిని. స్త్రీజాతిని ఎంతవరకు ద్వేషించగలనో అంతవరకూ ద్వేషించాను. అంచేత కాబోలు ఆపైన స్త్రీని ద్వేషించలేకపోయి, నాకొచ్చేనలభై రూపాయల గుమస్తాగిరీతోనూ, ఒంటి గాణ్ణవటంచేత. హాయిగా కాలక్షేపం చేసేవాణ్ణి...ఒకశుక్రవారం సాయింత్రం అనుకుంటా—నేనింకా ఆ వారం మరచిపోలేదు—నా జీవిత పథకము వంకర టింకరగా పోవటం ప్రారంభించింది. ఆనాడు సాయింత్రం సంధ్యాసమయంలో నెల్లూరు రోడ్డుమీద షికారుపోతున్నాను. ఆ త్రోవమ్మట అనేకసార్లు అదివరకు వెళ్లినా, ఆనాటి వరకూ కిటికీ పూచల సందుల్లోంచి నాకేసి చూసే నల్లని నిగనిగల గుడ్లతో కూడి కొనియున్న ఓ సుందరి సుందర వదనాన్ని నేను చూడలేదు. తళుక్ తళుక్ మని మెరిసే ఆ రెండు నల్లటి కళ్లు యిప్పుడు కూడ నా హృదయంలో ప్రతిబింబించుతున్నాయి."

అంతవరకు శ్రద్ధగా వింటున్న ఆమె అతని మాటలు కడ్డువచ్చి ఆశ్చర్యంగా "మీరు కవులు కూడానా?" అని అడిగింది.

"అవును......యేవో చిన్న చిన్న రచనలు రాస్తూవుండేవాణ్ణి." తిరిగి సాగించాడు తన కథని. "ఆ రెండు కళ్లకూ రెట్టింపు అందమిచ్చే ఆమె చెదిరిపోయిన కేశములలో దాగియున్న చంద్రబింబము వంటి ముఖము నా బ్రహ్మచర్య వ్రతానికి తిలోదకాలివ్వమని ప్రోత్సాహిస్తున్నట్లుగా కనిపించింది. అప్పుడు ఆమె చూపులలో కొంత దీనత్వం కూడ మిళితమైయుంది. వెంటనే నా బుర్రలో యేవో విప్లవాలు చెలరేగాయి. నేను యెటుసైకిలు త్రొక్కుతున్నానో యేమో నాకే తెలియలేదు. పచ్చటి తెరలు నా కళ్లకడ్డు పడ్డాయి. కొంతసేపటికి మాత్రం చేతితో అనుకొని నడిరోడ్డుమీద చతికల పడ్డా. చేతులు గీసుకు పోయాయి. కాళ్లుకొట్టుకుపోయాయి. ఇంతలో ఎవ్వరోవచ్చి ప్రక్కకి లాగేశారు. నా సైకిలు దూరాన్న పడివుంది. నేనో లాంతరు స్తంభానికి ఢీ కొన్నట్లు గ్రహించి తిరిగి ఆ కిటికీ వైపునకు చూస్తినిగదా. అవే ఆ రెండు నల్లటి మెరిసే కళ్లు నావైపే చూస్తున్నాయి. ఇంటికి యెల్లాగో చేరాను. రాత్రికి భోజనంలేదు. అన్ని ఆలోచనలు ఆమెను గురించే.

* * *

ఒక నాడు తిరిగి ఆ త్రోవనే పోతున్నా. వెనకు చెప్పిన ఆమె నా వైపే చూస్తూచిరునవ్వులో ఒక చీటి క్రిందగిరవాటేసింది. బ్రహ్మానంద భరితుడయ్యా. ఆ కాగితంలో యీ విధంగా వ్రాసియుంది. "నేను బందీకృతను......తప్పించుటకు వీలైన మార్గములు

వ్రాయబడియున్నవి... బంధ విముక్తదారిని చేయుటకు మీరు ప్రయత్నము చేయుదురని గట్టిగా నమ్ముచున్నదానను. మిగిలిన సంగతులు ముఖాముఖిని మాట్లాడుకో వచ్చును—''

మీ మనోహరి.

"ఆమె పేరు మనోహరి. నిజంగా ఆమె నా మనోహరి కూడాను. ఆమెను విడిపించే యత్నాలను వెదుకుతూ ఆ రాత్రంతా దీర్ఘాలోచనచేసా."

.........కొన్నిరోజులు తర్వాత అమావాస్యనాటి నడిరేయిలో కనిపించీ కనిపించని నక్షత్రపు వెలుగుల్లో పొడుగుగా సాగిపోయే ఆ రెండు నీడల జాడల్నిగాని, మమ్మల్నిగాని రక్షకభటులు గుర్తించ లేకపోయారు. అంతకుముందే ఉద్యోగానికి రాజీనామా యిచ్చేసి యుంటంచేత అమరునాడు నెల్లూరునుంచి బెజవాడకు అరుమైళ్ళదూరంలోవున్న మంగళగిరి పారిపోయాం.

......ఇంతలో యెక్కువగా మాట్లాడంచేత అతనికి చాలా అయాసం కలిగింది. ఊపిరి పీల్చటం కొంచెం కష్టంగా వుంది పాపం. నర్సు అతనిచే అంతసేపు మాట్లాడించుట తప్పని భావించింది. అతని స్థితి చూస్తే ఆమెకేదో అదుర్దా హెచ్చింది. అతని గుండెను పరీక్షించింది. గుండెచాలా నీరసించి పోయింది. కాఫీ త్రాగించడానికి ప్రయత్నించ పోయింది. కాని విఫలమైంది. తిరిగి ఆపద సంభవించిందని తెలుసుకొంది.

దుఃఖంతో "తరువాతకథ నాకు తెలుసులే యిక మాట్లాడవద్దు, అని గట్టిగా అరచింది. కాని అతడు,ఆమె...కొన్నిరోజులు...అనంతరం...నన్ను విడచి.........పోయింది. ...ఆ కళ్లు...—..." ఆయాసం మరీ యెక్కువయింది. అంటే అతని అసువులు అనంత వాయువులో తన ప్రియురాలి ఆ మెరిసే కళ్లను వెదుక్కొనేందుకు పోయాయి.

నర్సు తన జీవిత చరిత్రనే అతనిలా చెప్పగలిగాడా అనుకొంది మొదట 'అతనే—యితడు' అని యేమోమె గొణుగుకొంది. 'నన్ను రక్షించిన అతనికి ద్రోహంచేసాను.' నిజమే!... నా పాపాన్ని దేవుడు క్షమింపలేదు!...క్షమింపలేదు?......అని ఆమె కండ్ల వెంబడి నీరుకారుతున్నా పిచ్చిగా కేకపెడుతూ లేచింది. కళ్లనీరు యేకధారగా ప్రవహిస్తున్నాయి: ఆమెను చూచి మిగతా పేషంట్సు హడలిపోయారు. నాలుగడుగులు గబగబ నడచి యెదురుగా యున్న అద్దాల బీరువాలో తెల్లసీసా ఒకటితీసి నల్లని ద్రవ పదార్థం త్రాగేసింది.

ఆ గల్లంతు విని డాక్టరు వార్డులోనికి వచ్చి పడియున్న నర్సుని చూచి "ఏమిటి మిస్ ఏంచేసావు?" అని అన్నాడు ఖంగారుతో.

"దేవుడునన్ను క్షమింపలేదు డాక్టర్ ...ఆ... 7 వ బెడ్డు... నా ప్రియుడు" అంతేగొంతుక యిగిరి పోయింది. ఆమెఆత్మ దేనినింవెదకటానికి పరుగెత్తుకు పోయిందో.........

7 వ బెడ్డు దగ్గరికి పరుగెత్తి చూచాడు, డాక్టర్. అక్కడ వరొక శవము. నిర్ఘాంత పోయాడు! తనకూతురుగా భావించే నర్సు చని పోయింది. అతని కళ్ళమ్మట రెండువేడి బిందువులు గచ్చునేలపైబడి చిందర వందరయ్యాయి. ఆ నీటి చుక్కలే ఆరెండు ఆత్మలకు శాంతిని సూచించాయి.

ఆ రాత్రి శ్మశాన వాటికలో రెండు చితులు ఒకదాని ప్రక్కనొకటి మండుతున్నాయి. ఆ చితిలోంచి లేచేపొగలు ఒకటిగా కలిసి ఆకాశంలో అంతర్ధానమైపోయాయి.—.

కథాంజలి

అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-3-0

# * అనర్హుడు! *

* డి. శ్రీనివాసరావు *

అది ఆఖరురోజు. ఆరోజున వుత్తరం వచ్చి తీరాలి. దినమొక యుగంగా గడిపేడు. ఫలితంకోసం పలవరించేడు. పర్యవసానం తేలేవరకు అతని ఆరాటం ఆగడం లేదు. తపాలవాని దర్శనం కోసం తహతహలాడు తున్నాడు. వీధిలో నిరీక్షిస్తూ నిలబడ్డాడు. దూరాన్న కనిపించిన తపాలవాని ,తోలు సంచి అతని హృదయంలోని ఆందోళనను అధికంచేసింది. దడదడలాడే గుండెలతో గబగబా ఎదురువెళ్లాడు. దయగలిగిన తపాలమనిషి ఓ కవరు చేతికందించాడు. వణికే అతనిచేతులు లేఖని అందుకున్నాయి. కంగారునుసూచించే కరాలు కవరును సరిగా చించలేక పోయాయి. కవరులోని అంశాలు అతని ఆశాసౌధాల్ని అమాంతంగా కూల్చి వేసాయి. అతడు అనుకున్న విద్య నభ్య సించడానికి అనర్హుడుగా పరిగణింప బడ్డాడు.

అతడు ద్వితీయ కక్ష్య పరీక్ష ప్రధమ తరగతిలో విజయం పొందాడు. గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలు అతని అభిమాన శాస్త్రాలు.అత్యంతభిమానమైన రసాయినిక శాస్త్రాల్లో వున్నతవిద్య నభ్యసించడానికి విశ్వవిద్యాలయాధికారులకు దరఖాస్తు దాఖలు చేసుకున్నాడు, విద్యకు తగిన వయసూ్సా, వయస్సుకు తగిన విద్యావుంది. ఆటలలో ఆరితేరిన చెయ్యి. ఓర్పు, అణకువ అతనిసొమ్ము. సత్ప్రవర్తన అతని సంపద. శ్రద్ధ, సమర్థత చెప్పుకోదగ్గ గుణాలు. కావలసిన వాటికన్న ఘనమైన అర్హతలే వున్నాయి. తప్పకుండా వున్నతవిద్య నభ్యసించడానికి ప్రవేశం లభిస్తుందనే ధీమాతో వున్నాడు.

ఆ రోజున వచ్చినవుత్తరం అతని ఆశలను నిరాశచేసింది. అభిరుచులను మంటగల్పింది. ఆశయాలను భగ్నం చేసింది.

తర్వాత తెలిసిన విషయం అతన్ని ఆశ్చర్యంలో ముంచింది. విస్మయ చకితుణ్ణి


సిద్ధమైనాయ్!

ప్రజాబంధు

ఆఫీస్ కేలండర్లు

1947 వ సంవత్సరం, తెలుగు ఆఫీసు కేలండర్లు, తిథి వారనక్షత్రాలు సెలవులు యితర వివరాలతో సహా అందంగా తయారై అమ్మకమునకు సిద్ధంగా ఉన్నాయి.

వివరాలకు వ్రాయండి:

ప్రజాబంధు ఆఫీస్

39, ఆండర్సన్ వీధి, మదరాసు 1.

చేసింది. విశ్వవిద్యాలయ నిజస్వరూపం విభ్రాంతుణ్ణి చేసింది.

ప్రథమ పర్యాయం పరీక్షలో తప్పి రెండోసారి రెండో తరగతిలో నెగ్గిన ఓ విద్యార్థి అమాంతంగా అర్హుడయ్యాడు ఆ విద్యకే. అదృష్టవంతుడు.

నిజప్రపంచానికి మధ్యనున్న తెర తొలగి పోయింది. రంగం బయటపడింది. అర్హతలు అన్నీవున్నాయి. అవకాశాలు కావలసినవి వున్నాయి. కాని కలిగినఫలితం? అభిరుచిగల విద్య నభ్యసించడానికి అర్హుడు కాక పోయాడు. అనర్హుడుగా అధికారులచే త్రోసివేయబడ్డాడు. అతని మొర అడవిలోని ఆర్తనాదమైంది. ఆలకించే అధికారులు అశ్రద్ధ వహించారు. నిర్ణయాలు నిబంధనలు అతనిమీద నిర్దయచూపాయి. కంచె చేనుమేసింది. అర్హాతార్హతలు అధికారుల ఇష్టాయిష్టాలతో తారుమారవుతాయన్న నగ్న సత్యం తేట తెల్లమయింది.

అతడి అధికారుల అబ్బాయి కాక పోవడంవల్ల అదృష్టహీనుడయ్యాడు. డబ్బున్న వారిబిడ్డ కాక పోవడంవల్ల దురదృష్ట వంతుడయ్యాడు. ఆదుకునే అండ లేనందున చదువుకునే భాగ్యం లేకపోయింది. శిఫారసు చేయించుకునే శక్తి లేనందున విద్య నేర్చుకునే శక్తి దూరమయింది.

అతనివలె ఎంతమంది అలా అయిపోయారో! ఇంకా ఎంతమంది అతనిని అనుసరించ నున్నారో!


అజంతా చిత్రాలు!



ఆనాడు యేనాడో వ్రాసిన అజంతా చిత్రాల లోని స్త్రీలు అందగత్తెలు. ఆ అందచందాలు ఆకళా కోమలత్వాలు యీనాటి మహిళా మండలిలో అరుదు. మాతృత్వానికి అర్హత నిచ్చే పరిపూర్ణారోగ్యం ఈనాటి స్త్రీలలో లోపించింది. విడువకుండా "అరుణ" వాడితే ప్రత్యేకంగా స్త్రీలకు యేర్పడే గర్భ సంబంధ మయిన రుగ్మతలు అన్నీ తప్పకుండా అంతరిస్తవి. పరిపూర్ణారోగ్యం లభ్యమౌతుంది.

అరుణ


ఋతు సంబంధ దోషాలను అద్భుతంగా నివారించి, ప్రతి స్త్రీకి మాతృత్వ గౌరవాన్ని కలిగించగల ఉత్తమ రసాయనం.

(అన్ని మందుల షాపులలోనూ దొరకును)

ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,
79, గోపతి నారాయణచెట్టి రోడ్,
త్యాగరాయనగర్, మద్రాసు.

# పండిత మదనమోహన మాలవ్యా

మాలవ్యా నుంచి అలహాబాదు, కాశీ నగరాలకు వలస వచ్చిన బ్రాహ్మణ కుటుంబానికి చెందినవ్యక్తి పండిత మదన మోహన మాలవియా. ఈయన తాతగారిపేరు ప్రేమధర్ మాలవియా. ఈయన గొప్ప సంస్కృత పండితులు. బ్రిజ్ నాథ్ గారి కొడుకే మదన మోహన మాలవియా.



హిందూ మతోద్ధారకుడు కాశీ విశ్వవిద్యాలయ స్థాపకుడు స్వార్థరహిత దేశసేవకుడు మాలవ్యా అస్తమించాడు.

ఈయన అలహాబాదులో 1861 డిసెంబరు 25 వ తేదీన జన్మించాడు. అక్కడే ఉన్న పాఠశాలలో ఈయన హిందీ సంస్కృత భాషలను అభ్యసించాడు. 1884 లో పట్టభద్రుడయాడు. ఈయనకు 1881 వ సంవత్సరంలోనే వివాహమయింది. పట్టభద్రుడయిన వెంటనే ఉద్యోగం చేసుకోవలసి వచ్చింది. రెండు సంవత్సరాలు ఆంగ్లోపాధ్యాయుడుగా పనిచేసాడు. పాతిక సంవత్సరాల వయస్సు రాగానే ''హిందూస్థాన్'' అనే హిందీ దినపత్రికకు సంపాదకుడిగా నియమింపబడ్డాడు. వీరి సంపాదకత్వం క్రింద ఈ పత్రిక ఎంతో ప్రఖ్యాతిని సంపాదించుకుంది.

మిత్రుల ప్రోత్సాహం వల్ల మాలవియా ప్లీడరు పరీక్షలో కూచుని అలహాబాదు హైకోర్టులో న్యాయవాదిగా కొన్నాళ్లు జీవితాన్ని గడిపాడు. ఈ వృత్తిలో ఆయన వాక్చాతురి ఎంతో పేరు గడించుకుంది. 1888 లో ఆయన ''హిందూ సమాజాన్ని'' అలహాబాదులోనే వ్యవస్థాపించాడు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న వివిధ హిందూజాతుల మధ్య సౌహార్దతను పెంపొందించాలనే ఆశయంతో ఈ సంఘం స్థాపించబడింది.

అలహాబాదు మునిసిపల్ బోర్డునకు వైస్ ఛైర్మన్‌గా కూడా మాలవియా పనిచేసి స్థానిక ప్రజల మన్ననలను బడసినాడు.

1902 లో శాసన సభలో చేరి సభ్యుల ప్రవేశ విధానంలో మార్పులను తీసుకుని రావడానికి అనన్యంగా వాదించాడు. 1886 నుంచే ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూవచ్చాడు. ప్రతీ కాంగ్రెస్ మహాసభకూ హాజరై ఎన్నో సమస్యలగురించి ప్రసంగిస్తూండేవాడు. 1903 లో వచ్చిన మింటో మార్లీ సంస్కరణలను ప్రోత్సహించి ఇవి కాంగ్రెస్ ఉద్యమంయొక్క ద్వితీయ విజయం అని ప్రశంసించాడు.

1909 లో మాలవియాను లాహోర్ కాంగ్రెస్ కి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అప్పటికి ఆయన వయస్సు 47 సంవత్సరాలు. ఆ తరువాత 1918, 1933 సంవత్సరాలలో కూడా ఈయన కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు.

కాంగ్రెసులో ఈయన స్వార్థరహితంగా దీక్షతో సేవచేసాడు. అందువల్లనే ఈయన 1910 లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు.

విద్యావిషయిక సమస్యల్లో ఈయనకు అభిలాష ఎక్కువ. గోఖలేగారి ప్రాథమిక విద్యావిధా